

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ ప్రేమ్ కుమార్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారో స్వయంగా చూసారు. అయన మాట్లాడుతూ నిరంతర పఠనా ఆసక్తి, నైపుణ్యం, విలువలతో కూడిన విద్యను బోధించినప్పుడు ఉపాధ్యాయులకు శాశ్వత కీర్తి ప్రతిష్టలు ఉంటాయన్నారు. ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. అడవివరం హై స్కూల్‌లో జరుగుతున్న ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతా ప్రమాణాలు గణనీయంగా పెంచడానికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు పాల్గొన్నారు.

మత్స్యకార కార్పొరేషన్‌కి నిధులు కేటాయించాలి

మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెయ్యల

విశాలాంధ్ర - విశాఖ: గత ప్రభుత్వం కార్పొరేషన్ పేరుతో మత్స్యకారుల బలాన్ని చీలికలు చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మత్స్యకారులందరికీ ఒకేలా చూడాలని మత్స్యకార కార్పొరేషన్‌కి నిధులు కేటయించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెయ్యల నాగభూషణరావు కోరారు. విశాఖలోని 32వ వార్డు అల్లిపురం చలవతోటలో ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం జెండాను చెల్లూరు బుజ్జి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 32వ వార్డు జనసేన పార్టీ కార్పొరేటర్ కందుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నిషేధ కాలంలో ఇవ్వాల్సిన మత్స్యకార భరోసాను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య, మాజీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు చెల్లూరి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2 నుండి నృసింహ దీక్షలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ సింహాచలం స్వామి వారి దేవస్థానంలో ప్రతీ ఏటా జరిగే నృసింహ దీక్షల వేడుక డిసెంబర్ 2వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు ఈఓ వి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. నలభై రోజుల మండల దీక్షలను 2వ తేదీన, 12వ తేదీన రెండు విడతలుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జనవరి 12వ తేదీన దీక్షలు విరమణ వేడుక జరుగుతుందని స్పష్టం చేశారు. దీక్షలు ఆచరించిన భక్తులకు తులసిమాల, స్వామివారి ప్రతిమ దేవస్థానం అందజేస్తుందని తెలియ జేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులు భాగస్వాములై సింహాద్రినాథుడు కృపకు పాత్రులు కావాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. పోలిపాడ్యమి, మార్గశిర (పోలి) పాడ్యమి సందర్భంగా డిసెంబర్ రెండో తేదీన వరాహ పుష్కరిణిలో దీపోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవ కాశం ఉన్నందున భారీ భద్రత ఏర్పాట్లు వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు గత రెండు రోజుల నుండి జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశాలు నేటితో ముగుసాయని మండల విద్యాశాఖాధికారుణులు 1, 2 ఎం.శివరాణి, అట్టాడ జయప్రదలు తెలియజేశారు. వృత్యంతర శిక్షణలో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్లు రెడ్డివల్లి అప్పలరాజు, చప్పా అమర్నాథ్, మానాపురం రమాదేవి, కోసూరు లీలామణి శిక్షణ అందించారు. ఇందులో భాగంగా విద్యా ప్రవేశ్, తరళ్, ఆన్‌లైన్ శిక్షణ విధాన ఆవశ్యకత, ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, విద్యా సంబంధిత యాప్‌ల ఉపయోగం, టీచ్ టూల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర అంశాలపై చర్చించారు. శివరాణి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు పాఠ్యాంశ బోధనలో బోధనాభ్యాసన సామాగ్రిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకుడు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ పోటీలు

ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - పీఎం పాలెం: దేశవాలీ టీ20 క్రికెట్ టోర్నీ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ పోటీలు విశాఖపట్నం పీఎంపాలెం ఏసీఏ - వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పీవీజీ రాజు కాంప్లెక్స్, విజ్జీ స్టేడియంలలో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఈ మ్యాచ్‌లు డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో అస్సాం, రైల్వేస్, చండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ జట్లు పోటీపడనున్నాయి. ఆయా జట్లు బుధవారం విశాఖపట్నం చేరుకున్నాయి. ఇండియా, ఐపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఇందులో పాల్గొననున్నారు.

తాటితూరులో పొలంబడి

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం తాటుతూరు గ్రామంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులలో సాగు చేస్తున్న వరి పంట ధృవీకరణలో భాగంగా వరి పంటను మండల వ్యవసాయ అధికారి బి.శివ కోమలి, ఇంటర్నల్ ఇన్స్పెక్టర్ ఎన్.మాధురి, ఫీల్డ్ ఆఫీసర్ బి.స్వాతి సందర్శిం చారు. విశాఖ ఉద్యానవన ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఒప్పందం చేసుకున్న 10 మంది రైతుల ధాన్యం నమూనాలను పొలంలో అందరి సమక్షంలో కోత కోయించి ఒక్కో రైతు నుంచి నమూనాకి కిలో చొప్పున సేకరించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులకు గాప్ (స్కోపు) ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల వ్యవసా యాధికారి శివ కోమలి, ఇంటర్నల్ ఇన్స్పెక్టర్ మాధురి, ఫీల్డ్ ఆఫీసర్ స్వాతి, విఎఎలు హరీష్, రమేష్, కృపామని పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ పేమెంట్ యాప్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ అసెట్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్‌ను మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం ప్రారంభించారు. వీఎంఆర్డీఏకి చెందిన అన్ని వాణిజ్య సముదాయాల అద్దెదారులు తమ దుకాణాల నెలవారీ అద్దెల చెల్లింపులు ఇకపై కొత్తగా అభివృద్ధి పరచిన యాప్ ద్వారా సులభతరంగా చెల్లించవచ్చని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ అప్లికేషన్‌ను హెచ్‌డీఎఫ్‌సీ అభివృద్ధిపరచి, తదనంతర సాంకేతిక మద్దతు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమీషనర్, కార్యదర్శి రమేష్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, వరి పాలనాధికారి వేంకటేశ్వరరావు, హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనజాక్షి, బేగం డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖలో న్యాయ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. అల్లిపురం చలువతోట వద్ద బుధవారం నిర్వహించిన నిరసనలో మహిళా సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనజాక్షి, ఎండి బేగంలు మాట్లాడుతూ ప్రధాన నిందితుడు వంశీ ఒక పథకం ప్రకారం న్యాయ విద్యను అభ్యసిస్తున్న యువతిని ప్రేమి స్తున్నానని నమ్మించి తాను అనుభవించి తన స్నేహితులను కూడా పురిగొల్పి పాడుచేసి వీడియో తీసి బెదిరించి అన్యాయం చేసాడని తెలిపారు. ఇటువంటి సంఘటన భవిష్యత్తులో జరుగ కుండా నిందితులు.. వంశీ, జగదీష్, ఆనంద్, రాజేష్‌లకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఏ.దేముడమ్మ, సభ్యులు బి.పుష్పలత, సీహెచ్ నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ: అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దీన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల డిమాండ్ చేశారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో పాత ఆరిలోవ దుర్గ గుడి నుండి ముస్తఫా కాలనీ సచివాలయం నెంబరు 4 వరకు ప్రదర్శన, ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మంది సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటూ పెరిగిన అద్దెలు కట్టుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరిలోవ నివాసం ఉంటున్న అర్హులైన పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇచ్చి ప్రజలను ఆదుకోవాలని కోరారు. లబ్ధిదారులు నింపిన అప్లికేషన్లను సచివాలయం కార్యదర్శి బేగంకి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, సిహెచ్.చక్రమ్మ, కాసుబాబు, పి.పుష్పలత, బి.రాజు పాల్గొన్నారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలు లబ్దిదారులకు అందించాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి: గత ప్రభుత్వాలు కేటాయించిన ఇళ్లు, ఇళ్ల స్థలాలు లబ్దిదారులకు స్వాధీనపరచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సమితి సభ్యులు వై.రాంబాబు, సీనియర్ నాయకుడు వై.త్రినాథ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు వేపగుంట చుట్టు పక్కల గల టిడ్కో లబ్దిదారులు, జగన్ ప్రభుత్వంలో కేటాయించిన ఇళ్ల లబ్దిదారులు, ఇప్పటివరకు కనీసం ఇళ్లు లేని నిరుపేదలతో కలిసి ముత్యమాంబ గుడి వద్ద నుంచి 484 సచివాలయం వరకు సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. సిపిఐ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ తరలివెళ్ళి అక్కడ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అధికారులను కలిసి లబ్దిదారుల తరపున వినతి పత్రాలు సమర్పించారు. ఈ సంధర్భంగా ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గత ప్రభుత్వం హయాంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను లబ్దిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకుడు వై. త్రినాథ్ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలో నిరుపేదలకు దున్నే వాడిదే భూమి హక్కు నినాదంతో భూ పోరాటాల్లో భాగంగా రైతులకు వ్యవసాయం కోసం అలాగే వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీపీఐ పార్టీదని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై. రాంబాబు, ఆశిరి నాయుడు, మీన్నారావు, రామారావు,తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని స్టేడియంలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గత కొంతకాలంగా సుమారు రూ.7 కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. జీవీఎంసీ అధికారులతో కలిసి స్టేడియంను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. మైదానమంతా కలియ తిరిగి ప్రస్తుతం ఉన్న వసతులను పరిశీలించారు. క్రీడాకారుల సౌకర్యార్థం వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేసేందుకు ఉన్న ప్రతిపాదనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి స్టేడియంను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఆధునీకరించిన గ్యాలరీలను, మరుగుదొడ్లను, ఏసీ క్యాబిన్లను, వాల్ పెయింట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల తాజా పరిస్థితిని జీవీఎంసీ సీఈ శివప్రసాద్ రాజు కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనుల గురించి తెలిపారు. నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కార్యాచరణ రూపొందిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. స్థానిక జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ, శాప్ అధికారులు తదితరులు వారి వెంట ఉన్నారు.

కామ్రేడ్ కోలా గురుమూర్తి స్ఫూర్తితో పోరాటాలు

జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రమణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ జిల్లా కార్మిక ఉద్యమ నిర్మాత, కమ్యూనిస్టు యోధుడు, మున్సిపల్, మెడికల్, ఆర్టీసీ వంటి రంగాలతో పాటు అసంఘటిత రంగ కార్మికులను చైతన్యం చేసి అనేక హక్కుల్ని సాధించిన వీర పోరాట యోధుడు కామ్రేడ్ కోలా గురుమూర్తి అని జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ అన్నారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కోలా గురుమూర్తి 32వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ ముఖ్యంగా మున్సిపల్ రంగంలో వివిధ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాల పెంపు ఎన్.ఎం.ఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత తదితర అనేక హక్కులని రాజీ లేని పోరాటాల ద్వారా సాధించడంలో కీలక పాత్ర గురుమూర్తి పోషించారన్నారు. ఏఐటీయుసీ నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా, జీవీఎంసీలో మొదటి సిపిఐ పార్టీ తరపున కార్పొరేటర్‌గా నిత్యం కార్మికులు, ప్రజలతో మమేకమై పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపైన జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నేటికీ కూడా నిలిచినటువంటి మహాయోధుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి కోటా సత్తిబాబు, జీవీఎంసీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, వీర్రాజు, అనిల్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కే.సత్య నారాయణ, కోలా వాణి, లింగాల వెంకటేష్, కిలారి శివ, సబ్బి, రమేష్, కొర్రయి రమేష్, భాస్కర్, సింహాచలం, బంగారయ్య, కరుణాకర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - మల్కాపురం: విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, రాజకీయవేత్తలు అంతా కలిసికట్టుగా పనిచేయాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి కాశీ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య అనేది భవిష్యత్తుకు మనం పెట్టే పెట్టుబడి అని అన్నారు. హెచ్.పి. సి.ఎల్. సీనియర్ అధికారి సుమన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. సమావేశంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రముఖ కవి కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిసాయి. ముగింపు సభకు సాహిత్య సుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పెదగంట్యాడ సీఏ జి.దాలి బాబు మాట్లాడుతూ గ్రంథాలయాలను అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పి.లక్ష్మీబాయి, గ్రంథాలయ అధికారి పి.వి.రమణ, గ్రంథాలయ పాఠకులు రమ్య,లావణ్య, నవ్య, రాంబాబు, రాకేష్, అనిల్, సురేష్ పాల్గొన్నారు.

అమెరికన్ వీసా కోసం దళారులను నమ్మకండి

విశాలాంధ్ర - మధురవాడ: అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చే యువతలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారని ఐతే వీసా కోసం దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు అని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం కాన్సులర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ విభాగం అధిపతి ఎస్. జెన్నె సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ లో అమెరికాలో ఉన్నత చదువులకు వీసా పొందే విధానంపై బుధవారం జరిగిన కార్యక్రమంలో అమె ప్రసంగించారు. అమెరికాలోని 4500 గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఉన్నాయని వీటిలో ప్రవేశానికి ఆసక్తిగల వారు హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయంలో ఎఫ్-1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నకిలీ సర్టిఫికేట్‌లతో వీసా పొందాలనుకునే వారికి భవిష్యత్తులో అమెరికాలో ప్రవేశానికి శాశ్వతంగా మార్గాలు మూసుకుపోతాయన్నారు. వీసాకోసం జరిగే ఇంటర్వ్యూలో విద్యార్థులు సుదీర్ఘ ప్రసంగాలు చేయకుండా వీసా అధికారితో ముఖాముఖి సమాధానాలను ఇవ్వడానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆంగ్లభాషా పరిజ్ఞానం, గ్రామర్ పొరపాట్ల వంటివి తాము పెద్దగా పరిగణలోకి తీసుకోమని, ముఖ్యమైన ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం ఇచ్చారు అనేది ప్రధానమైనదన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులు, ఆర్థిక పరిస్థితి, అమెరికాలో ప్రవేశానికి సంబంధించిన విశ్వవిద్యాలయాల పత్రాలు ముఖ్యంగా పరిశీలిస్తామన్నారు. వీసా ఇంటర్వ్యూలో విద్యార్థుల ఆందోళన, వత్తిడి అర్థం చేసుకుని స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తామని తెలిపారు. వీసా ఇంటర్వ్యూకు కావలసిన కీలక పత్రాలను అమె విద్యార్థులకు వివరించారు. ఇంటర్వ్యూలో వ్యవహరించాల్సిన పద్ధతులను తెలియజేశారు. దేశంలోని 33 కేంద్రాల ద్వారా వీసాను మంజూరు చేస్తామన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్ తదితరులతో సమావేశమయ్యారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం తగదు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో మరింత పురోగతి సాధించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు ఇండ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఇండ్ల నిర్మాణాల పనుల్లో వెనుకబడిన మండల అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో డిస్టిక్ హౌసింగ్ హెడ్ ఏ శ్రీనివాసరావు.,డి.ఈ కే సూర్యరావు, పిడి యుసిడి సత్యవేణి, జీవీఎంసీ ఎడిషనల్ కమిషనర్ బివి రమణమూర్తి, మండల్ ప్రత్యేక అధికారులు, ఏఈ లు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

26న బహిరంగ సభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: బీజేపీ ప్రభుత్వ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబర్ 26న జీవీఎంసీ వద్ద జరగబోయే బహిరంగ సభ జయప్రదం చేయాలని చిట్టివలస సిఐటియు ఆఫీసు వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నంబరు 26 తేదీన అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సభ ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం ఆపాలని, కార్మికుల్ని బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనాలు 26,000 అమలు చేయాలని,ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులని పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ కమిటీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఏయూ గ్రంథాలయంలో ఇన్ఫ్లిబినెట్ సేవలు

ఎంఓయూ చేసుకునే దిశగా చర్చలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇన్ఫ్లిబినెట్ సేవలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు, పరిశోధనలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏయూ అధికారులు ముందడుగు వేశారు. బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్ ఏయు విసి ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్ఫ్లిబినెట్ అందిస్తున్న సేవలను అభిషేక్ వివరించారు. ఈ సందర్భంగా త్వరలో ఇన్ఫ్లిబినెట్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవాలని ఏయు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. దీనికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని గ్రంథాలయ అధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లకు సూచించారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన ఐఐఎం అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం శాఖ గ్రంథాలయాన్ని గంభీరం ఐఐఎం లైబ్రరీ అధికారులు బుధవారం సందర్శించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాల అమరికను, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి ఆనందపురం శాఖా గ్రంథాలయానికి 11 ఇంగ్లీష్ పుస్తకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ బి.వి.ఎస్. అప్పారావు, గంభీరం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లైబ్రేరియన్, సీనియర్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ విగ్నేశ్, జూనియర్ సూపరింటెండెంట్ పి.ఇందు, లైబ్రరీ అసిస్టెంట్ స్వాతి, లైబ్రరీ అసిస్టెంట్ వి.శ్రీను, లైబ్రరీ అసిస్టెంట్ బి.కనక మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కొమ్మాది: పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. విశాఖపట్నం మధురవాడలోని డాక్ యార్డు కాలనీలో నిర్మించిన శ్రీ పైడిమాంబ అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠను శతాధికా ప్రతిష్టాచార్యులు అధికార్ల కాళిదాసు బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణ మధ్య భక్తుల కోలాహలంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్ళా వెంకటరావు, బంగారు అశోక్ కుమార్, నక్కాన శ్రీధర్, చిన్నం నాయుడు, ఆలయ కమిటీ గౌరవ సలహాదారులు వి.నాగమ్మ, ఎస్.పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాలతో ఆటలాడొద్దు

మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: తాత ముత్తాతల దగ్గర నుండి గంగమ్మ తల్లినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల బ్రతుకుపై పెత్తనం చేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు, మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు అన్నారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష ఏడవ రోజు కొనసాగింది. మత్స్యకార యువత, మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంఘీభావం తెలియజేయడం శుభ పరిణామమని గంటా నూకరాజు అన్నారు. నవంబర్ 21 ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అందరికీ ముందుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ... మత్స్యకారుల దినోత్సవం నాడు సమస్యలపై పోరాటం చేయడం దురదృష్టకరమని అన్నారు. మత్స్యకారుల జీవితాలతో ఆటలు ఆడాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలిసి వస్తుందని అన్నారు. కష్టపడి నీతిగా బ్రతకడం తెలుసని, సాధారణ జీవితాలకు ఆదర్శంగా ఉండే మాపై ప్రతాపం చూపాలని చూస్తే మేమేంటో చూపిస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తీరప్రాంతం అంతా కాలుష్యంతో నిండిపోయి ఉందని అన్నారు. అధికారుల వైఫల్యం కారణంగా ఇంకా అధ్వాన్నంగా తయారయిందని అన్నారు. అధికారులు దీనికి కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు చవి చూడాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమఇంలో కృష్ణా జిల్లా అవనిగడ్డ నుండి విచ్చేసిన కోలా బాలాజీ, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, గ్రామాభివృద్ధి సేవాసంఘం గౌరవ అధ్యక్షులు పిసి అప్పారావు, కోశాధికారి బర్రి కొండబాబు, పెద్దలు వాసుపల్లి గరగయ్య, పుక్కళ్ళ ఎల్లారావు, పుక్కళ్ళ అమ్మోరు, వాసుపల్లి హరిబాబు, మట్టా కొండ, దోని నర్సింగరావు, దూడ రాజు, పీరుపిల్లి కిరణ్, వాసుపల్లి ఎల్లాజీ, సీపీఐ నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్. అప్పలనాయుడు, నొల్లి రమణ, పొట్టి రజనీకాంత్, వాడమొదలు వీరన్న, బర్రి రాము, ఉమ్మిడి మసేను, వాసుపల్లి రాజు, వాడమొదలు తవుడయ్య, కూర్మాన రాజబాబు, నొల్లి ఎర్రయ్య, కోడకొండ, పీరుపిల్లి మసేను, పీరుపిల్లి, పీరుపిల్లి కొర్లయ్య, అల్లిపిల్లి గురువులు, సూరాడ ఎర్రిబాబు, కూర్మాన సత్యం, తెడ్డు సత్యంబాబు, వాసుపల్లి అప్పన్న, అల్లిపిల్లి సింహాచలం, మట్టా ఎల్లయ్య, ఉమ్మిడి దాసు, పుక్కళ్ళ అమ్మోరుతో పాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మత్స్యకారుల నిరసనలకు సీపీఎం మద్దతు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారుల సమస్యలు పరిష్కారం చేయాలని గత ఏడు రోజులుగా నిరసనలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా సిపిఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు వెంటనే పరిష్కరించలాని అన్నారు. సముద్రంపై ఆధారపడే మత్స్యకారులకు కనీస వసతులు ప్రభుత్వం కల్పించలేక పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు, రేసు నరసింహారావు, అచ్చారావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - మల్కాపురం: షిప్ యార్డ్ గాంధీగ్రామ్ శాఖా

గ్రంథాలయాధికారి బద్దుకొండ కనకరాజు ఆధ్వర్యంలో ముగింపు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయలు విద్యార్థుల విజ్ఞానాన్ని, యువతకు ఉద్యోగ సాధనకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన పలువురు విద్యార్థులకు నాగేశ్వరావు చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్య క్రమంలో హెచ్ఎస్ఎల్ యూనియన్ నాయకులు ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయులు హరినాథ్, మూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

భీమిలి: భీమునిపట్నం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ జరిగాయి. లక్ష్మణ్‌రావు

అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, అతిథులుగా టి.భీమారావు, కె.ఆనందరావు, గణపతిరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

వైసిపి నాయకులతో అదీప్ రాజ్ సమీక్ష

విశాలాంధ్ర - పెందుర్తి: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, భవిష్యత్తులో వైసీపీకి మంచి రోజులు రానున్నాయని, ఆ పార్టీ అధికార ప్రతినిధి, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ పేర్కొన్నారు. రాంపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ 93వ వార్డు నాయకులు, కార్యకర్తలతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ రానున్న రోజులలో వార్డులో చేపట్టాల్సిన కార్యక్రమాలు , పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు తదితర అంశాలపై చర్చించారు. పార్టీకి పూర్వవైభవం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 93వార్డు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఉదారత

విశాలాంధ్ర - ఆనందపురం: మండలం ముచ్చర్ల పంచాయితీ పరిధిలోని గొంపవానిపాలెం గ్రామానికి చెందిన గొంప రమణ ఇటీవల గుండెపోటు తో మరణించారు. ఆయన కుటుంబానికి మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ బాధిత కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ముచ్చర్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బంటుబిల్లి అప్పలనారాయణ మరి కొంతమంది బోసు బాబుకు తెలియజేయగా నిరుపేదలైన రమణ కుటుంబానికి 50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి విఎస్ఆర్ కుటుంబ సభ్యులు ఆర్థికసాయం

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస బంగ్లామెట్టకి చెందిన పి.కీర్తి భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూ జూడో ఆటలో విశాఖ ఆంధ్ర యూనవర్సిటీలో జాతీయ స్థాయికి ఎంపికై మధ్యప్రదేశ్ భూపాల్‌లో ఆంధ్రప్రదేశ్ తరుపున 78 కేజీల కేటగిరిలో ఆమె తలపడనుంది. ఈమెకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం వెంపాడ శ్రీనివాసరెడ్డిని సంప్రదించగా వెంటనే విఎస్ఆర్ గ్రూపు కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో 6100 /- అందజేశారు.

బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు చినముసిడివాడలో 95, 97 వార్డులకు సంబంధించి భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు సమావేశం బుధవారం 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన బిజెపి ప్రాథమిక సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వానికి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందన్నారు. దేశం మొత్తం మీద అంతర్గతంగా బలపడిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గొర్లె రామునాయుడు, మండల అధ్యక్షులు చిట్టిబోయిన శంకర్, మాజీ కన్వీనర్ కోనమంగయ్య నాయుడు, ధనలక్ష్మి, గురునాథ్, కార్యకర్తలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధింసా నృత్యంలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - భీమిలి: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భీమిలి ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రూఫ్ డాన్స్, ఈవెంట్ పోటీలలో ధింసా నృత్యంలో రెండవ బహుమతి గెలుచుకున్నారని, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్.విష్ణుమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

స్కూల్, అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మిడివానిపాలెం గ్రామంలో ఎలిమెంటరి స్కూల్, అంగన్వాడీ బిల్డింగ్‌కి 6 లక్షల 96 వేలు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చొరవతో మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటర్రావు, సర్పంచ్ రాంబాబు,కూటమి నాయకులు లొకిరెడ్డి అచ్చిబాబు, కోరుకొండ మూర్తి,కోరాడ శ్రీను, బొద్దపు గోవింద, గుర్ల ముసలినాయుడు, గోంతిన ముసలినాయుడు, గుర్ల విజయ్, అప్పలరాజు, ఎంపీటీసీ పల్లా రమణ, మాజీ ఎంపీటీసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అణు శక్తిపై అవగాహన కోసం 'ఆటమ్ ఆన్ వీల్స్' ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారత ప్రభుత్వ అటామిక్ ఎనర్జీ శాఖ ఆధ్యర్యంలో పనిచేస్తున్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్పీసీఐఎల్), అణు శక్తి యొక్క ప్రయోజనాలు మరియు సామాజిక ఉపయోగాల గురించి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు భారతదేశంలో అణు విద్యుత్తు కర్మాగారాలను సురక్షితంగా నిర్వహించడం గురించి ప్రజలకు తెలియజేసేందుకు భారతదేశ వ్యాప్తంగా వరుసగా అనేక ప్రచారాలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆటమ్ ఆన్ వీల్స్" అనే ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రచారాలను ప్రారంభించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్పీసీఐఎల్ డిప్యూటి జనరల్ మేనేజర్ అమ్రితేష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ విద్యార్థులకు రేడియేషన్, అణు వ్యర్థాల నిర్వహణ, రక్షణ గురించి లోతుగా, తదితర వాటితో సహా అణు విద్యుత్తు యొక్క వివిధ అంశాల గురించి వివరించారు. అన్ని సోర్సుల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియ గురించి, అణు విద్యుత్తును క్లీన్, గ్రీన్, సురక్షితమైన మరియు సుస్థిరమైన విధానంలో ఉత్పత్తి చేసే ప్రక్రియ గురించి తెలిపారు. ప్రజల్లో అణు శక్తి గురించి చైతన్యాన్ని పెంచేందుకు ఎన్ పిసిఐఎల్ చేసిన కృషిని ఆ సంస్థ కోవాడ ప్రాజెక్ట హెడ్ రవి కుమార్ బళ్ళ వివరించారు.

ఈథనాల్, హైడ్రోజన్ బయోఫ్యూయల్స్ పురోగతే లక్ష్యం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఈథనాల్, హైడ్రోజన్, బయోఫ్యూయల్స్ పురోగతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్టీ) ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇండియన్ ఆయిల్) సహకారంతో నిర్వహిస్తున్న 'ఎనర్జీ టెక్నాలజీ మీట్ (ఈటీఎం) 2024'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పురోగతి ద్వారా 'వికసిత భారత్'కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మన దేశ ఎనర్జీ డిమాండ్ 2047 నాటికి రెట్టింపు అవుతుందన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో భారతదేశం నుంచి మాత్రమే 25 శాతం వృద్ధి డిమాండ్ ఉంటుందన్నారు. నికర జీరో లక్ష్యాలను సాధించడంలో చురుకుగా ఉన్న చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు), ప్రైవేట్ ఇంధన కంపెనీలను ప్రశంసించారు.

నగర వాతావరణ మార్పునకు

జివిఎంసి ప్రత్యేక కార్యాచరణ

నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచ వ్యాప్తంగా నగరాలలో గణనీయంగా వాతావరణం మార్పులు చెంది ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుందని, ఇది నగర్రలకు ఒక సవాలుగా మారిందని, విశాఖ నగర వాతావరణం మార్పుపై జివిఎంసి ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని విశాఖ నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె జివిఎంసి ఆధ్వర్యంలో ఐసీఎల్ఈఐ ఆర్గనైజేషన్ క్లైమేట్ యాక్షన్‌పై రెసిలియెన్ట్ సిటీస్ ప్లానింగ్, ఆచరణ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో 3 నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ యొక్క ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన వర్క్ షాప్ నందు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ కారణంగా గ్లోబల్ టెంపరేచర్స్ పెరుగుతుండడం వలన సముద్ర మట్టం పెరగడం, తీవ్ర వాతావరణ సంఘటనలు, వరదలు, కరువు, తుఫాన్లు, వాయు కాలుష్యం వంటి ప్రభావాలను పెంచుతుందన్నారు. ఇప్పటికే భారత దేశంలో గల నగరాలు వరదలు, తుపానులు, తీవ్రమైన శీతాకాలాలు, తీవ్రమైన వేడి తరంగాలకు గురవుతున్నాయని, వీటి తీవ్రత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖపట్నం ఒక తీరప్రాంత పరిశ్రమ నగరంగా పలు ప్రమాదాలు, విపత్తులకు గురవుతోందన్నారు. పరిస్థితులు క్లైమేట్ చేంజ్ ప్రభావాల వల్ల మరింత తీవ్రంగా మారుతున్నాయని ప్రజల రక్షణ దిశగా విశాఖ నగర క్లైమేట్ చేంజ్‌ను ఎదుర్కొనడానికి ప్రభుత్వం పలు అనుసరణ, నిరోధక చర్యలను తీసుకుంటోందన్నారు. విశాఖ నగరం ఇప్పటికే పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంలో ముందంజలో ఉందని, జివిఎంసి 13 మెగావాట్ల సోలార్ శక్తి గరిష్ఠ సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నీటిపై, భూమిపై రూఫ్‌టాప్‌లపై ఏర్పాటు చేసి గ్రీన్ ఎనర్జీ ద్వారా నగరానికి కావలసిన అవసరాలను సమకూర్చుకుంటోందన్నారు. అనంతరం విశాఖపట్నం క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లాన్ ను జీవీఎంసీ ఎస్ ఆరయు టీమ్ పిపిటీ ద్వారా వివరించారు. అనంతరం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమనారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్ రాజు, ఆర్గనైజేషన్ ప్రతినిధి ఈమని కుమార్, ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, విజయవాడ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లానింగ్ చర్చలలో పలు అంశాలపై చర్చించారు. ఈ వర్క్ షాప్ నందు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర రావు, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వారా రవీంద్ర, , శ్రీకాకుళం కమిషనర్ ప్రసాదరావు, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పీ. నల్లనయ్య, కాకినాడ కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్యరాజు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, కార్యనిర్వాహక ఇంజ నీర్లు ఏడుకొండలు, రత్నాకర్ రెడ్డి, జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు

రూ.కోటి 60 లక్షలతో రామవరం రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - ఆనందపురం: కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆనందపురం మండల పార్టీ నాయకులు తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు పేర్కొన్నారు. గురువారం కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయం సమీపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండిగుండం నుండి వయా రామవరం, భీమన్న దొరపాలెం వరకు సుమారు 7 కిలోమీటర్లు బిటి రోడ్డుకు కోటి 60 లక్షల రూపాయలు ఎనర్జీఎస్ నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోని సుమారు 7 కోట్ల రూపాయలతో పలు గ్రామాలలో రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా బీటీ రోడ్లు దబ్బంద, అరిగి మేరక, దొంతల వారి కల్లాలు, ఆకుల వారి కల్లాలు, జిఎస్ అగ్రహారం, రామవరంలోను, సిసి రోడ్లు పాలవలస, ఎల్వి పాలెం, తర్లువాడ, గంభీరం, పేకేరు, వేములవలస తదితర గ్రామాలలో సుమారు ఏడు కోట్లతో రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరల సుమారు మూడు కోట్ల రూపాయలతో పలు గ్రామాలలో డ్రైనేజ్ పనులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, పాండ్రంకి అప్పలరాజు, గన్ రెడ్డి రమేశ్, బంటు చిన్న ఆబోతు అప్పల రాము, ఎర్ర పైడిరాజు, కట్టమూరి సొము నాయుడు, వప్పల శ్రీకాంత్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌హెచ్‌పి దాఖలు చేసిన ఏజిస్ వోపాక్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఏజిస్ లాజిస్టిక్స్ లిమిటెడ్ ("కంపెనీ") యొక్క మెటీరియల్ అనుబంధ సంస్థ అయిన ఏజిస్ వోపాక్ టెర్మినల్స్ లిమిటెడ్ ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ కోసం సెబి వద్ద డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి)ని దాఖలు చేసింది. ఏజిస్ వోపాక్ టెర్మినల్స్ లిమిటెడ్ జూన్ 30, 2024 నాటికి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పిజి) మరియు లిక్విడ్ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం పరంగా అతిపెద్ద భారతీయ మూడవ పక్ష యజమాని మరియు ట్యాంక్ స్టోరేజ్ టెర్మినల్స్ ఆపరేటర్ గా వుంది. ("ఈక్విటీ షేర్లు") యొక్క ముఖ విలువ రూ. 10 యొక్క ఈక్విటీ షేర్ల యొక్క తాజా ఇష్యూని కలిగి ఉంటుంది, దీని మొత్తం మొత్తం రూ. 3,500 కోట్లు ("ఇష్యూ") మరియు అవసరమైన ఆమోదాలు మరియు మార్కెట్ పరిస్థితులకు లోబడి చేపట్టబడుతుంది.

హత్య కేసులో ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - ఆనందపురం: ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ముద్దాయిలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విదిస్తూ విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తీర్పును ఇచ్చారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ప్రకారం, విజయనగరం జిల్లా మోదవలస గ్రామానికి చెందిన బాడిదబోయిన రాములప్పడుకు, విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం, కురుపల్లి గ్రామానికి చెందిన నరసయ్యమ్మతో 2008 సం.లో వివాహం అయినది. వీరికి ఒక బాబు, ఒక పాప సంతానం, నర్సయ్యమ్మ, తన అక్క కొడుకైన గండిబోయిన అప్పలరాజుతో వివాహేతర సంబంధం పెట్టుకోవటం వలన, రాములప్పడు, నర్సయ్యమ్మకు మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. తేదీ 13.02.2018 ది.న శివరాత్రి పండుగ నిమిత్తం నర్సయ్యమ్మ తన పిల్లలతో సహ గొట్టిపల్లి వెళ్లగా, రాములప్పడు కూడా పని ముగిసిన తరువాత గొట్టిపల్లి వెళ్లాడు. నర్సయ్యమ్మ, అప్పలరాజు, వారికి అడ్డుగా ఉన్న రాములప్పడు ను చంపాలని ముందుగా అనుకున్న పదకం ప్రకారం, అప్పలరాజు అతని తమ్ముడు ఎల్లారావు, రాములప్పడు ను మందు త్రాగటానికి ఊరి చివర మామిడి తోటకు తీసుకొని వెళ్లి అక్కడ మద్యం త్రాగాక అప్పలరాజు ఎల్లారావులు, ఇరువురు రాములప్పడు తో గొడవ పడి రాములప్పడు ను కర్రతోను, చేతులతో కొట్టి చంపారు. తరువాత ఇంటికి వెళ్లి నర్సయ్యమ్మ కు జరిగిన విషయం చెప్పి, తరువాత ముగ్గురు ఒక ఆటోలో మామిడి తోటకు వెళ్ళి రాములప్పడు శవాన్ని అక్కడ నుండి మోదవలస రాములప్పడు ఇంటికి తీసుకొని వెళ్ళి అక్కడ ఉంచి, ముగ్గురు అక్కడ నుండి పరారయ్యారు. రాములప్పడు తమ్ముడు బాడిదబోయిన గౌరి ఇచ్చిన పిర్యాదు పై ఆనందపురం పోలీసులు క్రైమ్ నెంబర్ 33/2018 , యూ బై ఎస్ 302, 34 ఐపీసీ యు బై ఎస్ 302, 120-బి,364 ఆర్ బై డబ్ల్యూ 34 ఐపిసి సెక్షన్లు క్రింద చార్జ్ షీట్ ఫైల్ చేసి, సరియైన సాక్షదారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వర రావు వాదనలు వినిపించగా, నిందితుల పై పెట్టిన కేసు రుజువు కావటంతో ఏ 1: గండిబోయిన అప్పలరాజు కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు 1 లక్ష 20 వేలు రూ.లు జరిమానా, ఎ 2: బాడిదబోయిన నరసయ్యమ్మ కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు 60 వేలు రూ.లు జరిమానా విదిస్తూ, జరిమానాలో 1 లక్ష 50 వేల రూపాయలు మృతుని పిల్లలకు నష్టపరిహారం, మృతుని పిల్లల యొక్క సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇస్తూ తీర్పు ఇచ్చారు. ముగ్గురిలో గండిబోయిన ఎల్లారావు మైనర్ కావటంతో అతనికి జువనైల్ కోర్టు లో 2022 సం.లో మూడు సంవత్సరాలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సమష్టి కృషితో

జలవనరుల సంరక్షణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని చెరువులు, సాగునీటి కాలువలు, స్లూయిజ్లు, జల ధారలను సంరక్షించేందుకు ప్రత్యేక ప్రణాళిక, సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. నీటి వనరుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని 23 వేల క్యూబిక్ మీటర్లకు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, నీటి వనరులను సంరక్షించేందుకు ముందుకొచ్చిన దాన్ ఫౌండేషన్ కు సహకారం అందించాలని సూచించారు. ఆక్రమణలు తొలగించాలని, సరిహద్దులు గుర్తించాలని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సాయంత్రం జలవనరుల సంరక్షణ, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. సమీప రైతులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడాలని, చెరువుల ఆధునికీకరణ, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని యూసిడి పీడీ, డీఆర్డీయే పీడీలకు చెప్పారు. స్థానిక పరిస్థితులు, ఆక్రమణలు ఇతర అంశాలపై రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. తదుపరి ఉమ్మడి కార్యాచరణకు అందరూ సంసిద్ధంగా ఉండాలని, ధాన్ ఫౌండేషన్ రూపొందించిన ప్రణాళికకు అనుగుణంగా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ప్రధాన నీటి వనరులైన మేఘాద్రి గెడ్డ, గోస్తని నది తాజా పరిస్థితిపై నివేదిక సమర్పించాలని ఆయా తహశీల్దార్లను ఆదేశించారు.

జిల్లాలోని మొత్తం 14 చెరువులు, 17 జల ధారలు, 16 కి.మి. మేర సాగునీటి కాలువలు, 11 కొత్త స్లూయిజ్లు, మరో మూడు స్లూయిజ్లకు మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.కోటి అంచనాతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేష్ తెలిపారు. పర్యావరణ హితమైన విధానాలతో చెరువులను, కాలువలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. క్యాస్కేడింగ్ అనే పేరుతో మూడు పద్ధతుల్లో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా రాంపురం, ఆటోనగర్, కొత్తపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పనులు పూర్తి అయితే వెయ్యి మందికి ప్రత్యక్షంగా, ఐదు వేల మందికి పరోక్షంగా ప్రయోజనాలు ఒనగురుతాయని చెప్పారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు.

సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఏడీసీ రమణమూర్తి, జీవీఎంసీ సీఈ శివప్రసాద్ రాజు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.